క్లుప్తంగా

చర్యలు తీసుకోవాలి



విద్యార్థులతో కిక్కిరిసిన స్కూల్ బస్

తంగళ్లపల్లి: ధనార్జనే ధ్యేయంగా కొన్ని ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులను పరిమితికి మించి స్కూల్ బస్సుల్లో తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం విద్యార్థులతో కిక్కిరిసి వెళ్తున్న ఓ పాఠశాల స్కూల్ బస్సును ఆపి ప్రశ్నించారు. ఒకే భవనంలో నిబంధనలకు విరుద్ధంగా మూడు పాఠశాలలు నడిపిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. విభాగ్‌కన్వీనర్ సమానపల్లి ప్రశాంత్ ఉన్నారు.

కలప తరలింపుపై నోటీసులు



కలపను తరలిస్తున్న ట్రాక్టర్ (ఫైల్)

వేములవాడరూరల్: మండలంలోని మల్లారంలోని ప్రభుత్వ స్థలంలోని చెట్లను పాలకవర్గ అనుమతులతో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు నరికి కలపను తరలిస్తున్న విషయంపై అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు మండల, జిల్లాఅధికారులకు ఫిర్యాదుచేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై 10రోజుల క్రితం జిల్లా అధికారులు మల్లారం గ్రామంలోని ప్రజాప్రతినిధులకు నోటీసులు జారీచేసినట్లు తెలిసింది. ఏదేమైనప్పటికీ ప్రభుత్వ స్థలంలోని చెట్ల నరికివేత, తరలింపుపై అధికారుల అనుమతులు లేకుండా ప్రైవేటు వ్యక్తులకు విక్రయించడంతో ఈ నోటీసులు జారీచేయడంపై మండలంలో చర్చ జరుగుతోంది.

వసతి గృహ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న సంక్షేమాధికారి

గంభీరావుపేట: మండలకేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహ సదుపాయాన్ని డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వసతి గృహ సంక్షేమాధికారి భూదేవి అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో శనివారం సమావేశమై మాట్లాడారు. కళాశాలల్లో అడ్మిషన్లు పొందిన దూర ప్రాంతాల విద్యార్థులు హాస్టల్‌లో చేరాలని కోరారు. అన్ని రకాల సౌకర్యాలు హాస్టల్‌లో ఉన్నాయన్నారు. ప్రిన్సిపాల్ వెంకట్‌నాయక్, టీచర్లు ఉన్నారు.

శని త్రయోదశి వేడుకలు



నవగ్రహాలకు పూజ చేస్తున్న భక్తులు

వేములవాడ: రాజన్న అనుబంధ ఆలయమైన భీమేశ్వరాలయంలో శనివారం శనిత్రయోదశి వేడుకలు నిర్వహించారు. భక్తులునవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. ఆలయ అధికారులు ఏర్పాట్లు పరిశీలించారు.

బాలాలయంలో భజన

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి(బాలాలయం)లో శనివారం భక్తులు భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం 6నుంచి రాత్రి9గంటల వరకు భజన, పారాయణం, తీర్థప్రసాద వితరణ చేశారు. ఆలయకమిటీ చైర్మన్ నంది కిషన్, సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, బొమ్మకంటి రవీందర్, నర్సయ్య, రాంరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

స్వయంకృషి..

- యువత చూపు....ఉపాధి వైపు
- స్వశక్తితో రాణిస్తున్న యువత
- వ్యాపారాలు, వ్యవహారాల్లో మునుముందుకు
- కుటుంబాలకు అండగా నిలుస్తున్న నవతరం

సిరిసిల్లఅర్బన్: సొంత కాళ్లపై నిలబడాలన్న ఆకాంక్ష నేటి యువతను విపరీతంగా ఆకర్షిస్తోంది. ఉన్నత విద్యాభ్యాసం చేసినప్పటికీ స్వయం ఉపాధి మార్గాలనే ఆశ్రయిస్తున్నారు. స్వీయ సంపాదనతో కుటుంబానికి అండగా నిలుస్తూనే తమలాంటి యువతరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉద్యోగాల్లో ఉండే సహజమైన ఒత్తిడికి దూరంగా అభిరుచికి దగ్గరగా నచ్చిన రంగాన్ని ఎంచుకుని స్వయంకృషితో రాణిస్తున్నారు. శ్రమనే పెట్టుబడిగా, నైపుణ్యమే దక్షతగా స్వయం ఉపాధిలో రాణిస్తున్న జిల్లాలోని కొంతమంది యువతను 'సాక్షి' పలకరించింది.





సొంత వ్యాపారంతో ముందుకు

సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్‌లో నివసిస్తున్న ఉప్పుల సంతోష్‌కుమార్ హైదరాబాద్‌లో బీటెక్ పూర్తి చేశాడు. చదువయ్యాక కొన్నాళ్లు సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా కొనసాగాడు. స్వయంకృషితో పైకి రావాలన్న తలంపుతో సిరిసిల్లకు వచ్చి సొంతవ్యాపారం ప్రారంభించాడు. కిరాణషాపు నడిపిన తండ్రి రవీందర్ పరిచయాలతో వ్యాపారాన్ని బాగా విస్తరించాడు. హోల్‌సెల్‌గా కిరాణం సరుకులను విక్రయిస్తూ రాణిస్తున్నాడు. వ్యాపార విస్తరణలో భాగంగా మారుతున్న ప్రజల అభిరుచికి అనుగుణంగా కొత్తగా ఆలోచించాడు. మూడేళ్ల క్రితం గానుగ యంత్రాన్ని ప్రారంభించాడు. ఇప్పుడు అది కూడా పుంజుకుంటోంది.

20 ఏళ్లుగా మెకానిక్‌గా..

సిరిసిల్ల పట్టణంలోని అంబికానగర్‌కి చెందిన ఎండీ. షాదుల్ల 20ఏళ్లుగా కార్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. చిన్నప్పటి నుంచి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో అండగా ఉండేందుకు మెకానిక్ వృత్తిని ఎంచుకున్నాడు. కరీంనగర్, హైదరాబాద్‌వంటి పట్టణాల్లో ప్రముఖ కార్ల కంపెనీల్లో మెకానిక్‌గా పనిచేశాడు. తర్వాత సొంతగా వ్యాపారం చేయాలనుకుని సిరిసిల్లలోనే కార్ మెకానిక్ షాపు పెట్టుకున్నాడు. తనకు తెలిసిన వృత్తి నైపుణ్యంలో రాణిస్తూ మంచి మెకానిక్‌గా పేరు సంపాదించుకున్నాడు. ప్రస్తుతం షాదుల్ల వద్ద ఐదుగురు యువకులు పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. నెలకు లక్షలోపు సంపాదిస్తూ ఇతరులకు ఉపాధి కల్పిస్తున్నాడు.



కారు రిపేర్ చేస్తున్న షాదుల్ల



డెయిరీఫామ్‌తో ఉపాధి

పట్టణానికి చెందిన పయ్యావుల ప్రవీణ్ యువకుడు డిగ్రీపూర్తి చేసి హైదరాబాద్‌లో యానిమేషన్ ఇతర కోర్సులు నేర్చుకున్నాడు. ఉద్యోగ ప్రయత్నాలు చేస్తుండగా సొంత వ్యాపారం చేయాలని నిశ్చయించుకున్నాడు. ఇందు కోసం పలు వ్యాపారాల గురించి వివరాలు సేకరించాడు. చివరకు వ్యవసాయరంగంలో స్వయం ఉపాధి పొందాలని నిర్ణయించుకుని లాభదాయకమైన పాడి పరిశ్రమపై దృష్టిసారించాడు. రాజీవ్‌నగర్‌లో మూడేళ్ల కిత్రం రెండెకరాల స్థలాన్ని అద్దెకు తీసుకున్నాడు. 14 గేదెలను కొని డెయిరీఫామ్ ప్రారంభించాడు. వీటి ద్వారా ప్రతినెలా రూ.40 వేలకు పైగా ఆదాయం ఆర్జిస్తున్నాడు. మరో ముగ్గురికి ఉపాధి కల్పిస్తూ ముందుకు సాగుతున్నాడు.

ప్రజల సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యం

సిరిసిల్లఅర్బన్: నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలంగాణ పవర్ లూమ్ టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ అన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి 20, 32, 33వ వార్డుల్లో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జిందం చక్రపాణి అధ్యక్షతన బీఆర్‌ఎస్ బూత్ కమిటీల నియామకాలు చేపట్టారు. ప్రజల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎక్కడలేని సంక్షేమ పథకాలను నిరుపేదల కోసం ప్రవేశపెట్టిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతీ కార్యకర్త కృషి చేయలన్నారు. రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య మున్సిపల్ చైర్‌పర్సన్ జిందంకళ, కౌన్సిలర్లు ఆడెపు సౌజన్య, సయ్యద్ సీమాబేగం గడ్డం లత, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బొల్లి రాంమోహన్, నాయకులు మహేందర్, అక్రం, భాస్కర్, మహిళా అధ్యక్షురాలు బత్తుల వనజ, తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

జీతాలు పెంచాలని రోడ్డుపై బైఠాయింపు



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజనం నిర్వాహకులు

వేములవాడ/వేములవాడరూరల్/ఇల్లంతకుంట: సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో శనివారం మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం వేతనాలు పెంచకపోవడంతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వేములవాడ పట్టణంలోని తెలంగాణచౌక్‌లో రోడ్డుపై బైఠాయించారు. వీరికి సీపీఐ నాయకులు సంఘీభావం తెలిపారు. వేములవాడ ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఇల్లంతకుంట మండలకేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈవో బన్నాజీకి వినతి పత్రం అందించారు. వారం రోజులుగా ఆందోళనచేపట్టినప్పటికీ ప్రభుత్వం స్పందిచడం లేదన్నారు.

పెద్దబడిలో స్థానికులకే ఉపాధి కల్పించాలి

ఎల్లారెడ్డిపేట: మండంకేంద్రంలోని పెద్దబడిలో స్థానికంగా నివసిస్తున్న వారికే ఉపాధి కల్పించాలని ఎస్సెమ్సీ సమావేశంలో సభ్యులు శనివారం తీర్మానించారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో తల్లితండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. పెద్దబడిని మంత్రి కేటీఆర్ రూ.8.50 కోట్లు వెచ్చించి ఆధునీకరించారని అయితే పాఠశాలలో తరగతి గదులు, డైనింగ్‌హాలు శుభ్రం చేయడానికి సిబ్బంది లేకపోవడంతో ఓ ఏజెన్సీకి అప్పగించారు. పాఠశాలలో పనిచేయడానికి స్థానికులకే అవకాశం ఇవ్వాలని హెచ్‌ఎంకు వినతిపత్రం సమర్పించారు. స్థానికులను కాకుండా వేరేవారికి అవకాశం ఇస్తే స్థానికులు ఉపాధికోల్పోతారని పేర్కొన్నారు. సమావేశంలో హెచ్‌ఎం హన్మండ్లు, ఎస్‌ఎంసీ చైర్మన్ ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్, సభ్యులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.



హెచ్‌ఎంకు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

వృద్ధులకు వాకింగ్ స్టాండ్‌ల అందజేత

వేములవాడ: వయోభారంతో నడవలేని స్థితిలో ఉన్నవారికి మైవేములవాడ ట్రస్టు ఆధ్వర్యంలో వాకింగ్ స్టాండ్‌లు పంపిణీ చేశారు. దీంతో వృద్ధులంతా నిండుమనస్సుతో దీవించారు. రాజన్న ఆలయ పరిసరాల్లోని పేదలకు వీటిని అందించారు.

సీసీ కెమెరాలపై అవగాహన..

తంగళ్లపల్లి: మండలంలోని బాలమల్లుపల్లెలో శనివారం విలేజ్ పోలీస్ ఆఫీసర్ శ్రీకాంత్ గ్రామస్తులకు కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నాయకులు కస్తూరి తిరుపతిరెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టేందుకే అసత్య ఆరోపణలు

సిరిసిల్లఅర్బన్: ప్రజలను మభ్యపెట్టెందుకే సిరిసిల్ల మున్సిపల్ పాలకవర్గంపై బీజేపీ పట్టణాధ్యక్షుడు శ్రీనివాస్ అసత్య ఆరోపణలు చేస్తున్నాడని బీఆర్‌ఎస్ యూత్ నాయకులు పేర్కొన్నారు. శనివారం బీఆర్‌ఎస్ యూత్ ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్‌లో యూత్ నాయకులు సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజలను మభ్యపెట్టేందుకే బీజేపీ పట్టణాధ్యక్షుడు శ్రీనివాస్ బీఆర్‌ఎస్ నాయకులపై అసత్య ఆరోపణలు చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్లాక్ మెయిల్‌కి పాల్పడుతూ, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. మంత్రి కేటీఆర్ కృషితో సిరిసిల్ల మున్సిపల్ పలు అవార్డులను కైవసం చేసుకుందన్నారు. మంత్రి కేటీఆర్‌ని నిందించే నైతనిక హక్కు లేదన్నారు. ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ బీఆర్‌ఎస్ యూత్‌నాయకులు కత్తెర వరుణ్, టీఆర్‌ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, కౌన్సిలర్లు దార్ల సందీప్, అన్నారుపు శ్రీనివాస్, ఆకుల చిన్న, రాపెల్లి దినేశ్, యూత్‌నాయకులు మునీర్, మెట్ట రాజు, అమ్జద్, టీఆర్‌ఎస్‌వీ అధ్యక్షుడు సికిందర్, పంగ మధు మహేందర్, అనిల్, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ యూత్ నాయకులు

పాఠశాలలో పుస్తకాల ప్రదర్శన

తంగళ్లపల్లి: మండలంలోని ఓబులాపూర్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం పుస్తక పఠనోత్సవం సందర్భంగా.. పుస్తకాల ప్రదర్శన నిర్వహించినట్లు హెచ్‌ఎం బండి ఉపేందర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాసిన కథలు, పాడుపు కథలు వినిపించారు. ఏర్పాట్లను పర్యావేక్షించిన తెలుగు టీచర్ పద్మను హెచ్‌ఎం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి, గుండెల్లి రవీందర్, తిరుపతి, కీర్తి, గంగా భవానీ, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సభ

- చేసిన పనులకు బిల్లులు రావడం లేదన్న సర్పంచులు
- మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

ఇల్లంతకుంట: మండలపరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ వెంకటరమణారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సర్పంచులు తాము చేసిన పనులకు బిల్లులు రావడం లేదని, అధికారులను అడిగితే నిధులు లేవంటున్నారని సర్పంచులు అధికారులపై తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వల్లంపట్ల సర్పంచ్ కట్ట వెంకట్‌రెడ్డి తాను గ్రామంలో రూ. 9లక్షలు వెచ్చించి పనులు చేయిస్తే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నెలలకొద్ది తిప్పుకుంటున్నారని డీఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ ఇప్పుడు కంపోస్ట్‌షెడ్ల దగ్గర బాత్రూములు కట్టమంటున్నారని గతంలో చేసిన పనులకు బిల్లులు ఇస్తేనే కొత్త పనులు చేస్తామన్నారు. గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులైన్ కోసం సీసీరోడ్లు తవ్వి మళ్లీ సీసీ వేయలేదని, గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటరమణారెడ్డి ప్రజాప్రతినిధులతో మాట్లాడుతూ.. నెలరోజుల్లో పెండింగ్‌బిల్లులు చెల్లించేలా ఎంపీడీవో చర్యలు తీసుకుంటారన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులకు ఇబ్బందులు తలెత్తకుండా పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. గ్రామాల్లో జీపీ కార్మికుల సమ్మెతో అపరిశుభ్రత నెలకొంటుందని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. నాలుగేళ్లలో ఎన్‌ఆర్‌హెచ్‌ఎం పథకంలో ఏడాదికి రూ.10వేలు వస్తే వైద్యాధికారి సర్పంచులకు చెల్లించడం లేదని సర్పంచులు వాపోయారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సంజీవ్, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో మీర్జా, పీఆర్ డీఈ సుదర్శన్‌రెడ్డి, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు త్రినాథ్, ప్రేమ్‌కుమార్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణారెడ్డి

పంచాయతీ కార్మికుల వంటావార్పు

బోయినపల్లి/ఇల్లంతకుంట/చందుర్తి/వీర్నపల్లి: సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో జీపీ కార్మికులు చేపడుతున్న సమ్మె శనివారం 10 రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఇల్లంతకుంట మండలంలో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. బోయినపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ జీపీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపారు. చందుర్తిలో ఎంపీడీవో రవీందర్‌కు, ఎంపీవో ప్రదీప్‌కుమార్‌కు జీపీ కార్మికులు వినతిపత్రం సమర్పించారు. వినతి పత్రాన్ని ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. వీర్నపల్లి మండలకేంద్రంలో సమ్మెశిబిరం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. కార్మికులంతా కలిసి సామూహికంగా భోజనాలు చేశారు.



వంటావార్పులో ఎంపీడీసీ అరుణ్‌కుమార్

పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం

వీర్నపల్లి: మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాల, మండల పరిషత్ పాఠశాలల్లో శనివారం హెచ్‌ఎంలు కె.రవి, వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఇందుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. పఠనోత్సవం కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో నైపుణ్యం వెలికితీసేందుకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ పాఠ్యాంశాలతో పాటు చదువుల్లో ముందుండేలా కృషిచేస్తున్నామన్నారు. అనంతరం ఎంపీటీసీ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. పాఠశాల్లో నిర్వహించే సమావేశాలకు విద్యార్థుల తల్లిదండ్రు హాజరైతేనే పాఠశాల నిర్వహణ, విద్యార్థుల సామర్థ్యం తెలుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందిస్తోందన్నారు. కార్యక్రమానికి ప్రతిమ ఫౌండేషన్ సభ్యులు వెంకట్, కృష్ణారెడ్డి హాజరై పాఠశాలలో నూతనంగా సైన్స్ ప్రయోగశాలను ఏర్పాటుచేస్తామన్నారు. పిల్లల పాటలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం రవి

నిరుపేదలకు డబుల్ ఇళ్లు అందించేదెప్పుడో?

వేములవాడఅర్బన్: ప్రభుత్వం నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు అందిస్తామని ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా పనులు మధ్యలో నిలిచాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి రాములు అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లో నిర్మాణంలో ఉన్న డబుల్‌బెడ్రూం ఇళ్ల పనులను పరిశీలించి మాట్లాడారు. వేములవాడలోని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క డబుల్ బెడ్రూం ఇల్లుకూడా అందించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి నిరుపేదలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దేవరాజు, దేవయ్య, మల్లేశం, గణేశ్, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు

ప్రాణాలు నిలబెడుతున్న సీఎంఆర్‌ఎఫ్

ఎల్లారెడ్డిపేట: అపద సమయంలో నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరంలా మారి ఎంతోమంది ప్రాణాలు నిలబెడుతోందని జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్, గుంటపల్లిచెరువు తండాలలో శనివారం లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ పథకాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంజూరుకి కృషిచేసిన మంత్రి కేటీఆర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోటఆగయ్యకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అమృత, సునీత, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు బాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, అందే సుభాష్, గణేష్, ప్రభాకర్, రాజశేఖర్, కార్యదర్శి సంపత్, లబ్ధిదారులు పాల్గొన్నారు.



హరిదాస్‌నగర్‌లో చెక్కులు అందిస్తున్న నాయకులు

టేలాల తొలగింపు

వేములవాడ: రాజన్న గుడి చెరువు కట్టకింద రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన టేలాలను అధికారులు తొలగించారు. దీంతో భక్తులు సులభంగా ఆలయానికి రాకపోకలు సాగించేందుకు వీలు కలుగుతుందని స్థానికులు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఇకనుంచి రోడ్డుపై టేలాలకు అనుమతించవద్దని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు టై, బెల్టులు అందజేత

తంగళ్లపల్లి: మండలంలోని చిన్నలింగాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శనివారం ఉపాధ్యాయుడు అయ్యన్నగారి హరికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థులకు టై, బెల్టు లు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పావని, ఎస్సెమ్సీ వైస్‌చైర్మన్ గుర్రం జ్యోతి, టీచర్లు నర్సయ్య, రవిచంద్ర, అంజన్‌రెడ్డి, ఆంజనేయులు, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు

ఇల్లంతకుంట/గంభీరావుపేట/తంగళ్లపల్లి/వీర్నపల్లి: సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో శనివారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించుకున్నారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, పోతరాజుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. అమ్మవార్లకు బోనం సమర్పించి మొక్కుకున్నారు. ఇల్లంతకుంట వాణి నికేతన్ హైస్కూల్‌లో, గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో, తంగళ్లపల్లిలోని ప్రైవేటు పాఠశాలలో, వీర్నపల్లిలోని రంగంపేట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులు పండుగ ప్రత్యేకతను వివరించారు.









బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



సిరిసిల్లఅర్బన్: డబుల్ బెడ్రూం ఇల్లు రాలేదని తీవ్ర మనోవేదనకు గురై గుండెపోటుతో మృతిచెందిన ఈర్ల రాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ డిమాండ్ చేశారు. శనివారం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయించాలన్నారు. డ్రాలో పేరు రాని వారికి ఇచ్చిన హామీ మేరకు ఇంటి స్థలంతో పాటు, నిర్మాణానికి రూ. 3లక్షలు సాయం అందించాలన్నారు. గుండెపోటుతో మృతి చెందిన ఈర్ల రాజు కుటుంబానికి రూ.10లక్షలతో పాటు, డబుల్ బెడ్రూం ఇల్లుఇవ్వాలని డిమాండ్‌చేశారు. లేనియెడల ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కమిటీ నాయకులు కోడం రమణ, మోర అజయ్, నక్క దేవదాస్, గోవిందు లక్ష్మణ్, మోర తిరుపతి, బాబు ఉన్నారు.